సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 5 । జనవరి । 2024



ఆడపిల్లను కాపాడుకుందాం

ఆడశిశువును కాపాడడం ద్వారా సృష్టిని రక్షిద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య అన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని కఠినంగా అమలుచేయాలన్నారు. -8లో



చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 125 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నూతన నియామకం

రాయచోటి టౌన్: మత్స్యకార జేఏసీ రాష్ట్ర కో - కన్వీనర్‌గా వీరబల్లి మండలం వంగిమళ్లకు చెందిన సుంకు రవీంద్ర ఎంపికయ్యారు. బుధవారం విజయవాడలో జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఏర్పాటైంది. తన ఎంపిక అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి మత్స్యకారుల సమస్యలపై వివరించినట్లు రవీంద్ర తెలిపారు. మత్స్యకారులకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాలని కోరానన్నారు.

8న అప్రెంటీస్ మేళా

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 8వ తేదీ ఉదయం పది గంటల నుంచి ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్ మేళాను నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ జిల్లా కన్వీనర్ కే.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు అప్రెంటీస్‌ను కల్పిస్తారని తెలిపారు. అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలో ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఇందులో పాల్గొనే అభ్యర్థులు టెన్త్, ఐటీఐ మార్కుల జాబితా, ఎస్‌టీసీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా ఒరిజినల్, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను తమ వెంట తీసుకురావాలని తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో గురువారం రాయచోటి దేవాదాయశాఖ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రూ.7,07,545 ఆదాయం వచ్చినట్లు డైమ్మకొండ చైర్మెన్ నరసింహారెడ్డి, ఈవో మంజుల తెలిపారు.నాలుగునెలల కాలానికి సంబంధించి అమ్మవారికి వివిధ కానుకల ద్వారా 56 గ్రాముల బంగారు, 500 గ్రాముల వెండి వచ్చిందన్నారు. ఈ మొత్తాన్ని వాల్మీకిపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో జమచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు మల్లెల వెంకటేష్, నక్కామధుసూదన్, భాగ్యమ్మ, సిబ్బంది బాలకృష్ణ, వెంకటరమణ,మహేష్‌లు పాల్గొన్నారు.

జిల్లాకు 60 కొత్తబస్సులు



అధికారులతో మాట్లాడుతున్న డీపీటీవో రాము

పీలేరురూరల్ : జిల్లాకు 60 కొత్తబస్సులు మంజూరైనట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) రాము తెలిపారు. గురువారం పీలేరు డిపోను ఆయన తనిఖీ చేశారు. బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి నెల నుంచి రోడ్డు ఉన్న ప్రతి ఊరికి ప్రజా రవాణా శాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. పీలేరు డిపోకు 10 కొత్తబస్సులు రానున్నట్లు తెలిపారు. డీఎం కార్యాలయంలో ఆర్టీసీ ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరు కాలేదని వచ్చిన ఫిర్యాదు మేరకు హాజరు రిజిస్టరును తనిఖీ చేశారు. నలుగురు ఉద్యోగులు గైర్హాజరైనట్లు గుర్తించి వారికి వెంటనే మెమో జారీ చేయాలని డీఎంను ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు సుబ్బమ్మ, ఎస్టీఐ బాబునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

రామాపురం: స్వయం సహాయక సంఘల సభ్యులను లక్షాధికారులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం స్వయం సహాయక సంఘాలకు శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంఘాల్లో ఉండే మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆయన తెలిపారు. మహిళలు తమకు వచ్చే రాబడితో జీవనోపాధులను పెంచుకోవాలన్నారు. వెలుగు సిబ్బంది ద్వారా సంఘాల సభ్యులకు ఈ విషయంపై అవగాహన కల్పించాలన్నారు.వెలుగు అధికారులు గంగార్జున, ధర్మరాజు, ఖాదర్‌వల్లి, దేవసేన, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెన్నై వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ చౌడ మాలతి

పీలేరు: తలసేమియా వ్యాధితో బాధపడుతూ చెన్నైలో చికిత్స పొందుతున్న బాలునికి అక్కడికి వెళ్లి పింఛన్ పంపిణీ చేసిన పీలేరు పట్టణం కావలిపల్లె వలంటీర్ చౌడ మాలతి శభాష్ అనిపించుకుంది. పీలేరు పట్టణానికి పూజిత, సురేష్ దంపతుల కుమారుడు భవేష్ (5) చెన్నై రేలా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలునికి ప్రతి నెలా రూ. 10 వేల చొప్పున పింఛన్‌ను వలంటీర్ చౌడ మాలతి చెన్నైకి వెళ్లి అందిస్తోంది.

దిగుబడి తగ్గి.. ధర పెరిగి

- పుంజుకున్న టమాటా ధరలు
- మార్కెట్లో కిలో రూ.25
- తుపాన్ల ప్రభావంతో దెబ్బతిన్న తోటలు



మార్కెట్‌లో రవాణాకు సిద్ధంగా ఉన్న టమాటాలు

గుర్రంకొండ: జిల్లాలోని మార్కెట్లలో టమాటా ధరలు పుంజుకున్నాయి. ప్రస్తుతం కిలో టమాటా రూ.25 వరకు ధర పలుకుతోంది. నెలరోజుల క్రితం మార్కెట్లో కిలోరూ.10నుంచి రూ.12 వరకు మాత్రమే ఉండేవి. వారం రోజుల్లోనే 50 శాతానికి పైగా ధరలు పెరగడం గమనార్హం. ఇటీవల సంభవించిన వరుస తుపాన్ల కారణంగా వైరస్‌ల బారిన పడి టమాటా తోటలు దెబ్బతిన్నాయి. దీంతో జిల్లాలో పంట దిగుబడి సగానికిపైగా తగ్గిపోయింది. స్టాకులేక పోవడంతో ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి.

14654 ఎకరాల్లో పంట దిగుబడి

జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీ యార్డు పరిధిల్లో ప్రస్తుతం 14654 ఎకరాల్లో టమాటా పంట దిగుబడి వస్తోంది. గత ఏడాది ఐదేసీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 28634 ఎకరాల్లో దిగుబడి వచ్చింది. అయితే నెల రోజులుగా వాతావరణంలో మార్పులు, వరుస తుపాన్ల ధాటికి టమాటా తోటలు దెబ్బతిన్నాయి. ఒక్కసారిగా 50శాతానికి పైగా పంట దిగుబడి తగ్గిపోయింది. ప్రస్తుతం సగానికిపై పంట దెబ్బతింది. దీంతో జిల్లాలో వారం రోజులుగా టమాటాల స్టాకు తగ్గిపోయాయి. వారం రోజుల కిందట కిలో రూ.10నుంచి రూ.12 వరకు ధరలు పలికాయి. 30 కేజీల టమాటా క్రేట్ రూ.300 నుంచి రూ.360 వరకు ధరలు పలికాయి. ప్రస్తుతం మార్కెట్లో ధరల పుంజుకోవడంతో కిలో రూ.25 వరకు ధరలు పలుకుతున్నాయి. 30 కేజీల క్రేట్ ధర ప్రస్తుతం రూ.750 వరకు ధరలు పలుకుతున్నాయి. ప్రస్తుతం మొదటి రకం టమాటా కిలో రూ25, రెండోరకం కిలోరూ.18 మూడో రకం రూ.12వరకు ధరలు పలుకుతున్నాయి.

వైరస్‌లతో దెబ్బతిన్న తోటలు

వరస తుపాన్లు, మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా టమాటా తోటలు దెబ్బతిన్నాయి. జిల్లాలో గత రెండునెలలుగా చెదురుమొదరు వర్షాలు ఎక్కువగా కురిశాయి. దీంతో తోటలు రోగాల బారిన పడ్డాయి. వివిధ రకాల వైరస్‌లు ఎక్కువగా తోటలను ఆవహించడంతో పంటలు దెబ్బతిన్నాయి. ఎన్ని రకాల రోగ నివారణా మందులు వినియోగించినా ఫలితం లేకపోయిందని రైతులు వాపోతున్నారు. దీంతో పంట దిగుబడి ఒక్కసారిగా తగ్గిపోయింది.

వారం రోజులుగా మార్కెట్లకు వచ్చిన టమాటాల స్టాకు, ధరల వివరాలు

తేదీ	స్టాకు (టన్నుల్లో)	బాక్సు ధర (రూ.లలో)
డిసెంబర్ 28	458	580
29	492	620
30	365	600
31	476	635
జనవరి 01	319	900
02	486	750
03	474	800

900 నుంచి 450 మేట్రిక్ టన్నులకు పడిపోయిన స్టాకు:

ప్రస్తుతం జిల్లా మొత్తం మీద టమాటా పంట స్టాకు 450 మెట్రిక్ టన్నులకు పడిపోయింది. రెండునెలల క్రితం జిల్లాలో 900 మెట్రిక్ టన్నుల వరకు స్టాకు వచ్చేది. జిల్లాలో ములకల చెరువు, అంగళ్లు, మదనపల్లె, గుర్రంకొండ టామటా మార్కెట్లకు ప్రతిరోజు అధిక సంఖ్యలో స్టాకు వచ్చేది. ముఖ్యంగా పడమటి నియోజకవర్గాలైన మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తోటలు దెబ్బతిన్నాయి.తుపాన్ల కారణంగా వాతావరణంలో మార్పులు రావడంతో పంటపై తీవ్ర ప్రభావం చూపింది.

రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

ప్రస్తుతం రోజురోజుకు టమాటా ధరలు పుంజుకుంటున్నాయి. దీంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వైరస్‌లు, రోగాలను తట్టుకుని నిలబడిన తోటల్లో ఓ మోస్తరు దిగుబడి వస్తోంది. మళ్లీ కొత్త తోటల్లో దిగుబడి రావడానికి కనీసం నెలరోజులైనా పట్టే అవకాశం ఉంది. దిగుబడి పెరిగి పెద్ద ఎత్తున స్టాకు మార్కెట్లకు వస్తే ధరలు తగ్గే సూచనలున్నాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో తోటలు కోలుకొనే పరిస్థితి కనిపించడంలేదు. ఈనేపథ్యంలో జిల్లాలో రాబోయే రోజుల్లో టమాటా ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉందని అధికారులు, వ్యాపారులు అంటున్నారు.

ధరలు మరింత పెరిగే అవకాశం



ప్రస్తుతం టమాటా ధరలు పెరిగాయి. మార్కెట్లో ప్రస్తుతం కిలో ధర రూ.25 వరకు ధరలు పలుకుతున్నాయి. జిల్లాలోని మార్కెట్లకు స్టాకు రావడంలేదు. ప్రస్తుతం 450 మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే వస్తోంది. దీంతో మార్కెట్లో టమాటాలకు ఎక్కువ డిమాండ్ ఏర్పడి ధరలు పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశముంది. – జగదీష్, మార్కెట్‌కమిటీ కార్యదర్శి,వాల్మీకిపురం

ఆరోగ్య సురక్ష క్యాంపులను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులకు సూచించారు. గురువారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష, ఐసీడీఎస్, రీసర్వే మూడో దశ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీసీకి రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 2వ తేదీ నుంచి జరుగుతున్న రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలన్నారు. వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించి వివరాలు స్థానిక వైద్య సిబ్బందికి అందజేయాలన్నారు. ప్రజలు వైద్య శిబిరాలకు హాజరయ్యేందుకు వీలుగా ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పేషెంట్లకు సహకరించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో నిర్వహించే రెండో విడత జగనన్న సురక్ష క్యాంపులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. వైద్య శిబిరాల్లో ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు, 162 రకాల మందులు, 18 రకాల శస్త్ర చికిత్సల కిట్లు, 14 రకాల ఎమర్జెన్సీ కిట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆరోగ్య సురక్ష క్యాంపులలో కంటికి సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి కంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లాలోని రేషన్ షాపులకు వచ్చిన పౌష్టికాహారం కిట్లను వెంటనే ప్రతి అంగన్ వాడీ కేంద్రానికి చేరేటట్లు చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ నూరుశాతం పూర్తి కావాలన్నారు.కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొండయ్య, వైద్యులు, వ్యవసాయశాఖ జేడీ చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐల బదిలీ

రాయచోటి: జిల్లా పరిధిలో ఎస్‌ఐలను బదిలీలు చేస్తూ ఎస్పీ కృష్ణారావు ఆదేశాలను జారీ చేశారు. గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి ఎస్‌ఐల బదిలీ ఉత్తర్వులను పత్రికలకు విడుదల చేశారు... సుండుపల్లె ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి అన్నమయ్య జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ కాగా కడప 1వ పట్టణ ఎస్‌ఐ మధుసూధనరెడ్డి సుండుపల్లె ఎస్‌ఐగా, సంబేపల్లె ఎస్‌ఐ ఎస్‌ఎండీ షరీఫ్ అన్నమయ్య జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు, నిమ్మనపల్లి ఎస్‌ఐ రామకృష్ణ సంబేపల్లె ఎస్‌ఐగా, మదనపల్లె 2వ పట్టణ ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి తంబళ్లపల్లె ఎస్‌ఐగా, ములకలచెరువు ఎస్‌ఐ గాయత్రి అన్నమయ్య జిల్లా హెడ్ క్వార్టర్స్ డీసీఆర్‌బీకు, రాజంపేట అర్బన్ ఎస్‌ఐ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి రామాపురానికి, ముదివీడు ఎస్‌ఐ ముబీనాతాజ్ రాయచోటి అర్బన్ ఎస్‌ఐగా, అన్నమయ్య జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్న ఎస్‌ఐ మల్లిఖార్జునరెడ్డి ముదివీడుకు, రాయచోటి అర్బన్ ఎస్‌ఐ నరసింహారెడ్డి అన్నమయ్య జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐగా.. గాలివీడు ఎస్‌ఐ శివకుమార్ అన్నమయ్య జిల్లా హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు.

అవార్డు స్వీకరణ



అవార్డును కలెక్టర్‌కు అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

రాయచోటి: గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ వారు వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడక్ట్ (ఓడీఓపీ పథకంలో భాగంగా వచ్చిన అవార్డును జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ గురువారం స్వీకరించారు. ఈనెల 3వతేదీ న్యూఢిల్లీ ప్రగతి మైదానం భారత్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రమంత్రుల చేతుల మీదుగా జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి పి శ్రీనివాసరెడ్డి అవార్డు అందుకున్న సంగతి తెలిసింది. గురువారం అవార్డును కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్‌కు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఒక్కోజిల్లా నుంచి ఉత్పత్తిని గుర్తించి, ఆ ఉత్పత్తిని ప్రోత్సహించినందుకు ఓడీఓపీ అవార్డు ఇచ్చారన్నారు. ఈ పథకం కింద జిల్లా నుంచి మదనపల్లి చేనేత పట్టు చీరలను అందరి సహకారంతోనే ఓడీఓపీ ఉత్పత్తిగా గుర్తించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో 'పెద్ద పండుగ' సందడి!

- ప్రయాణికుల సేవకే ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం
- సంక్రాంతి నేపథ్యంలో ప్రత్యేక బస్సు సర్వీసులు
- సాధారణ చార్జీలతో ప్రయాణం



కడపలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: సంక్రాంతి పండుగ దగ్గరపడుతోంది. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా ఉమ్మడి వైఎస్సార్ జిల్లా అంతటా పండుగ ఏర్పాట్లు జరుగుతున్నాయి. పెద్ద పండుగ కావడంతో ప్రయాణికుల రద్దీని సొమ్ము చేసుకునేందుకు, అధిక చార్జీలు వసూలు చేసేందుకు ప్రైవేటు ట్రావెల్స్ సిద్ధమవుతున్నాయి.

ప్రయాణికుల సేవలో ఆర్టీసీ

ఒకవైపు ప్రైవేటు ట్రావెల్స్ అధిక ఛార్జీలు వసూలు చేస్తుంటే, మరోవైపు ఆర్టీసీ లాభనష్టాలతో ప్రమేయం లేకుండా, వారి సేవే పరమావధిగా అడుగులు వేస్తోంది. సంక్రాంతి, దసరా, దీపావళి, ఇతర ఉత్సవాల సమయంలో కూడా డిమాండును బట్టి ప్రత్యేక సర్వీసులను నడుపుతోంది. వరుస సెలవులు వచ్చే పండుగల్లో సంక్రాంతికి తొలి ప్రాధాన్యత ఉంటుంది. ఈ పండుగ వేళ దూర ప్రాంతాలకు ప్రయాణించే వారిపై గతంలో మాదిరిగానే అదనపు భారాన్ని మోపకుండా సాధారణ చార్జిలతో ఆర్టీసీ బస్సులు నడపనున్నారు. రాను, పోను ప్రయాణానికి ఒకేసారి టిక్కెట్ బుక్ చేసుకుంటే చార్జీలో 10 శాతం రాయితీ ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సంక్రాంతికి స్పెషల్ బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని ఆరు డిపోల నుంచి ప్రయాణికుల సౌకర్యార్థం 240 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడ, బెంగళూరు, చెన్నై, హైదరాబాదు, విశాఖపట్టణం, తిరుపతి తదితర పట్టణాలకు ప్రత్యేక సర్వీసులను నడపనున్నారు.

- ఆర్టీసీ ప్రయాణం సురక్షితం, సుఖవంతమనే నమ్మకంతో ఎక్కువ మంది ఆర్టీసీ బస్సులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో 30–50 శాతం ప్రత్యేక బస్సుల పేరుతో ప్రయాణికులపై అదనపు చార్జీల భారాన్ని మోపేవారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత సంస్థను ప్రభుత్వంలో విలీనం చేశాక ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. ప్రయాణికులపై పైసా అదనపు భారం వేయకుండా ప్రభుత్వం ప్రత్యేక బస్సులను సాధారణ చార్జీలతో నడుపుతుండడం విశేషం.

10 నుంచి బస్సుల రాకపోకలు



సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, చెన్నై, విశాఖపట్టణం తదితర నగరాలతోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు 240 ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నాం. ఈనెల 10వ తేదీనుంచి ఈ సర్వీసులు రాకపోకలు సాగిస్తాయి. – పొలిమేర గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి, కడప

ప్రత్యేక సర్వీసులు

పెద్ద పండుగ నేపథ్యంలో కడప రీజియన్ నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభించనుంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు 90, బెంగుళూరు 80, విజయవాడ 30, చెన్నై 10, తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురానికి 30 ప్రత్యేక సర్వీసులు కలిపి మొత్తం 240 సర్వీసులు నడపనున్నారు. ప్రయాణీకుల రద్దీని పురస్కరించుకుని అదనపు సర్వీసులను సైతం నడిపేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.అలాగే అన్నమయ్య జిల్లాలోని రాజంపేట నుంచి 3 విజయవాడ, 2 బెంగళూరు, రాయచోటి డిపో నుంచి విజయవాడ 6, బెంగళూరు 2, చెన్నై, హైదరాబాద్‌కు ఒక్కొక్కటి చొప్పున నడపనున్నట్లు ఆయా డిపోల మేనేజర్లు తెలిపారు.

కార్గో సేవలు వినియోగించుకోవాలి

సంక్రాంతి పండుగ వేళ బంధువులు, స్నేహితులకు సంక్రాంతి కానుకలను పంపుకునేందుకు తక్కువ చార్జీతో ఆర్టీసీ కార్గో సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లాకు చెందిన దూర ప్రాంతాల్లో ఉంటున్న ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

చెల్లని రూకలే మహా భాగ్యం



సి.రామచంద్రయ్య



జి.ద్వారకనాథరెడ్డి

- అవకాశవాదానికి ప్రతిరూపం సీఆర్సీ
- ఉనికి కోసం తాపత్రయపడుతున్న ద్వారకా
- అధిష్టానం వైఖరిపై తెలుగుతమ్ముళ్ల మండిపాటు

సాక్షి ప్రతినిధి, కడప: చెట్టు పేరు చెప్పుకుని కాయలు అమ్ముకునే ఆ ఇద్దరు 30 ఏళ్ల కిందట ప్రత్యక్ష రాజకీయ క్షేత్రంలో పోటీపడ్డారు. మూడు దశాబ్దాలుగా పరాన్నజీవులుగా రాజకీయాల్లో నెట్టుకొస్తున్నారు. వారిని తెలుగుదేశం అధిష్టానం తెరపైకి తెచ్చింది. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు లేని నాయకులను అంటగట్టడంపై మాకు ఇదేం ఖర్మ బాబు అనడం జిల్లాలో తెలుగుతమ్ముళ్ల వంతు అయింది. చెల్లని రూకలే మహా ప్రసాదంగా తెలుగుదేశం పార్టీ భావిస్తుండగా, శిరోభారమని టీడీపీ శ్రేణులు అంటున్నాయి.

- చెన్నంశెట్టి రామచంద్రయ్య తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కడప అసెంబ్లీ నుంచి 1985 ప్రత్యక్ష ఎన్నికల్లో తలపడి గెలుపొందారు. 1989లో జనరల్ ఎన్నికల్లో రాజంపేట పార్లమెంట్‌కు, 1991 ఉప ఎన్నికల్లో కడప పార్లమెంట్ అభ్యర్థిగా తలపడి ఓడిపోయారు. తర్వాత ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉంటూ పరోక్ష రాజకీయాల్లో నెట్టుకొచ్చారు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక నేతగా కొనసాగారు. ఆయనకు మంత్రి పదవి ఇచ్చారు. రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యుడిగా ఎంపియ్యారు. అయినప్పటికీ 2008లో ప్రజారాజ్యం పార్టీలో చేరారు. అనేక పదవులతో సత్కరించిన టీడీపీ పట్ల విశ్వాసం, విధేయతతో ఉండాల్సిన సీఆర్సీ ప్రజారాజ్యంలో, అక్కడి నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అక్కడ కూడా ఎమ్మెల్సీ దక్కించుకొని మంత్రి పదవిని చేజిక్కించుకున్నారు. 2018లో వైఎస్సార్సీపీలో చేరారు. ఎన్నికల తర్వాత ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఇలా పార్టీలు మారుతూ వచ్చి అవకాశవాదిగా సీఆర్సీ ముద్ర వేసుకున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. వయోభారంతో నెట్టుకొస్తున్న ఈదశలో ఆయన పార్టీ మారి అనైతికతకు నిలువెత్తు నిదర్శనంగా ఉండిపోయారని పలువురు కాపు నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

నాడు వైఎస్సార్ దీవెనలతో..

వ్యాపార వ్యవహారిక కార్యక్రమాల్లో ఉన్న గడికోట ద్వారకనాథరెడ్డి 1994లో ప్రత్యక్ష రాజకీయాల్లో ఆరంగ్రేటం చేశారు. అప్పటి వర్గ రాజకీయాల ఫలితంగా మాజీ మంత్రి ఆర్ రాజగోపాల్‌రెడ్డి ఓటమే లక్ష్యంగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్గీయులు పనిచేశారు. వైఎస్సార్ చల్లని దీవెనలతో ద్వారకా లక్కిరెడ్డిపల్లె ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తర్వాత టీడీపీ ఛీ కొట్టింది. 1999లో టికెట్ నిరాకరించింది. తర్వాత ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు. ప్రతిసారి ఎన్నికలకు ముందు ఉనికి చాటుకోవాలనే తపనతో తెరపైకి రావడం ద్వారకాకు సర్వసాధారణమైంది. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తాజాగా టీడీపీ కండువా కప్పుకోవడం విశేషం.

టీడీపీకి కొత్త తలనొప్పి

రాయచోటి టీడీపీ అభ్యర్థిత్వాన్ని మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్‌కుమార్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సుగవాసి ప్రసాద్‌బాబు ఆశిస్తున్నారు. తాజాగా ఆ జాబితాలోకి మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి వచ్చి చేరారు. ఇప్పటికే అనైక్యతతో కొట్టుమిట్టాడుతున్న నేతల మధ్యలోకి ద్వారకా రావడం కొత్త తలనొప్పి తెచ్చిపెట్టినట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. నిన్నమొన్నటి వరకు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి పేరు చెప్పుకొని వెలుగొందిన ద్వారకా వైఎస్సార్‌సీపీకి దూరం కావడం వెనుక అవకాశవాదం ఉన్నట్లు పరిశీలకులు చెప్పిపాడుస్తున్నారు. సీఆర్సీ,ద్వారకాలు చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకునే రకమని పలువురు ఆరోపిస్తున్నారు.

క్లుప్తంగా

అక్రమ మద్యం సీజ్

కలకడ : అక్రమ మద్యం కలిగిన వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసి అతని వద్ద ఉన్న 37 మందు సీసాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని కలకడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే దారి పక్కన కలకడ టౌన్‌కు చెందిన సయ్యద్‌బాషా అక్రమంగా మద్యం బాటిళ్లు కలిగి ఉండడంతో అరెస్టు చేశామన్నారు. తనిఖీలో 37 మందు సీసాలు సీజ్‌చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : మనస్థాపంతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. సీటీఎం పంచాయతీ నల్లగుట్టపల్లెకు చెందిన వేణు భార్య నందిని (26) కుటుంబ సమస్యల కారణంగా భర్తతో గొడవపడి మనస్థాపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

భార్య మందలించిందని...

కలికిరి : భార్య మందలించిందని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన కలికిరి మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ మధుసూదనాచారి కథనం మేరకు ... మండలంలోని పత్తేగడ గ్రామం బాలయ్యకుంటవడ్డిపల్లికి చెందిన బి.అమరనాథ(37) అప్పులు చేసి టమాటా పంట సాగు చేశాడు. పూర్తిగా నష్టం వచ్చింది. దీంతో పాటు అమరనాథ మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి కూడా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో 'మద్యానికి అలవాటు పడితే అప్పులు తీర్చడం ఎలా' అంటూ భార్య నిలదీసింది. దీంతో మనస్తాపానికి గురైన అతను ఇంట్లో గదిలోకి వెళ్లి ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. కొంత సేపటి తర్వాత గమనించిన భార్యా పిల్లలు హుటాహుటిన కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం మృతుని భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

వరుస చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

- సీసీ ఫుటేజీల ఆధారంగా ఏడుగురిని పట్టుకున్న పోలీసులు
- రూ.21.87లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రెండు స్కూటర్లు, ఒక కారు స్వాధీనం


పోలీసులు అదుపులో చోరీ కేసులో పట్టుబడిన నిందితులు

రాయచోటి టౌన్ : వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గురువారం జిల్లా ఎస్పీ తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. అన్నమయ్య జిల్లా పరిధిలోని గుర్రంకొండ, పెద్దమండెం, తంబళ్లపల్లె, కలకడ, వాయిల్పాడు, లక్కిరెడ్డిపల్లె మండలాల పరిధిలో ఇళ్లలో చోరీలు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ చోరీలు అన్నీ ఒక పద్ధతిలో జరగడంతో పాటు ఇళ్లకు కన్నాలు వేసి మరీ చోరీలకు పాల్పడినట్లు ఆధారాలు కనిపించాయని తెలిపారు. ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసుకొని తమ సిబ్బంది దర్యాప్తు చేపట్టారని తెలిపారు. ఆయాప్రాంతాలలో ఉన్న సీసీ ఫుటేజీల ఆధారంగా ఆ ప్రదేశాలలో సంచరించిన వ్యక్తులు ఈ ప్రాంతానికి కొత్తగా కనిపించడంతో పాటు అనుమానితులుగా కనిపించారని తెలిపారు. తమ దర్యాప్తులో వీరంతా తమిళనాడుకు చెందిన వారిగా గుర్తించి.. ఎంతో చాకచక్యంగా వలపన్ని పట్టుకున్నారని వివరించారు. పట్టుబడిన వారిలో కార్తికేయన్, మోహన్ రాజ్, శక్తివేల్, మురళి, దినగరన్, తిరుపతి, వెంకటేష్ చిన్నపయన్ వీరందరూ తిరువనంతపురం ప్రాంతానికి సమీప ప్రాంతాలలో నివాసం ఉండే వారని చెప్పారు.

గస్తీ కాసి.. చోరీ చేసి..

పట్టుబడిన నిందితులు తాపీ మేస్త్రీ వృత్తిగా జీవనం సాగిస్తూ ఉంటారని వివరించారు. క్రమంగా వీరు చెడు అలవాట్లకులోనై దొంగతనాలకు పాల్పడటం నేర్చుకున్నారన్నారు. ముందుగా ఆ వీధిలో కారులో కానీ స్కూటర్లలో కానీ తిరుగుతారు.. ఆ ప్రాంతంలో ఇళ్లకు తాళాలు వేసి ఉన్నట్లు గుర్తించి ఆ ప్రాంతానికి చేరుకొని ఇంటికి వెనుకవైపున గునపాలతో గోడను తవ్వేస్తారు. ఆపై ఎంచక్కా లోపలికి వెళ్లి డబ్బు, బంగారు, వెండి వంటి విలువైన వస్తువులు దోచుకెళ్తారని వెల్లడించారు. వారి వద్ద నుంచి 9 కేసులకు సంబంధించి 437.76 గ్రాముల బంగారు ఆభరణాలు, 417 వెండి ఆభరణాలు, రెండు స్కూటర్లు, ఒక కారు, ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. వీటి విలువ సుమారు రూ.21,87,500లు ఉంటుందని అంచనా వేశామన్నారు. ఈ కేసుల దర్యాప్తులో రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా, వాయిల్పాడు సీఐ సురేష్ కుమార్, గుర్రకొండ ఎస్ఐ పి. దిలీప్‌కుమార్, ఏఎస్ఐ మోసేస్, హెడ్‌కానిస్టేబుల్ జగదీష్, హోంగార్డు రాఘవ, టెక్నికల్ హెన్నికల్ హెడ్ కానిస్టేబుల్ రవి, సతీష్, అబ్దుల్లా బాగా కృషి చేశారని వీరికి ప్రశంసా పత్రాలతో పాటు నగదు పురస్కారం అందజేశారు.

అభూతకల్పనలతో బత్యాల రాజకీయం

- పొలిటికల్ మైలేజీ కోసం అసత్యపు మాటలు
- నేను స్ట్రైట్‌గా ఉంటా.. డబుల్‌గేమర్‌ని కాదు
- బత్యాల విమర్శలపై ఎమ్మెల్యే మేడా ఆగ్రహం



రాజంపేట : అభూతకల్పనలను సృష్టించి రాజకీయ పబ్బం గడుపుకోవడమే మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు నైజమని, ఇది ప్రజలందరికీ తెలుసునని రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నందలూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను రాజకీయాల్లోకి ప్రజాసేవ చేసేందుకు వచ్చానన్నారు. దోచుకో, దాచుకో నినాదం తనది కాదన్నారు. 'స్ట్రైట్‌గా ఉండడమే తెలుసుకానీ.. బత్యాలలా డబుల్‌గేమర్‌ని కాదని' ధ్వజమెత్తారు. ద్వంద్వ అర్థాలు మాట్లాడే అవసరం తనకు ఎప్పుడు రాలేదు, మాట్లాడను కూడా అని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో టూరిస్టు పాలిట్రిక్స్ చేసేవారి విమర్శలను ప్రజలు పట్టించుకోరన్నారని ఎద్దేవా చేశారు. ఎల్లోమీడియా ఒంటిమిట్టలో జరిగిన కార్యక్రమంలో తాను మాట్లాడిన మాటలను వక్రీకరించి, వారి పార్టీకి మైలేజి వచ్చేలా ఎల్లోమీడియా రాసుకుంటే, దానిని పట్టుకొని బత్యాల మాట్లాడటం చూస్తుంటే పుల్లగూర గోంగూర మాటాల్లా ఉన్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమం విషయం వీలైనంత వరకు చేశామని, చిన్న చిన్న వాటిని కూడా పూర్తి చేస్తామని సభలో చెప్పడాన్ని ఎల్లోమీడియా విషప్రచారం చేసి, దాన్ని పచ్చనేతలు దుష్ప్రచారంచేసి పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. అటువంటివారికి ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. తాను ఇక్కడ లోకల్ అని.. వలసనేతలకు రాజంపేటలో స్థానం లేదన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్


మాట్లాడుతున్న సీఐ పురుషోత్తం

ఒంటిమిట్ట : మండల పరిధిలోని రాచగుడిపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో గత నెల 15వ తేది జరిగిన హత్యకేసులో నిందితుడిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. హత్య కేసు వివరాలను ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్ రావుతో కలిసి వెల్లడించారు. రాచగుడిపల్లె ఎస్సీ కాలనీలో నివాసముంటున్న రామయ్య తన భార్య కృష్ణవేణి తన అన్న అందె సుబ్బరాయుడుతో అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో 2023 డిసెంబర్ 15వ తేది అర్థరాత్రి రోకలితో తలపై కొట్టి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన కృష్ణవేణి తిరుపతిలోని ఓ ప్రైవేటు అసుపత్రిలో చికిత్సపొందుతూ అదే నెల 30వ తేది చనిపోయింది. ఈ క్రమంలో పరారీలో ఉన్న భర్త అందె రామయ్యను మండల పరిధిలోని కుడుమలూరుకు పోయే మార్గంలో ఉన్న రాచగుడిపల్లి మూడు రోడ్ల కూడలి వద్ద అరెస్టు చేసినట్లు పోలీసులు వివరించారు.

దాడి కేసులో ఇద్దరికి జైలు

బి.కొత్తకోట: వ్యక్తిపై దాడిచేసిన కేసులో ఇద్దరు నిందితులకు మదనపల్లె కోర్టు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చిందని స్థానిక స్టేషన్‌హౌస్ ఆఫీసర్ ప్రశాంత్ గురువారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. కురబలకోట మండలం చెన్నామర్రిమిట్టకు చెందిన ఎస్.రెడ్డిశేఖర్ (35) బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ శీతివారిపల్లెలో ఉంటున్న మామ ఎస్.శివారెడ్డి, భార్యపై 2021లో దాడి చేశాడు. స్థానికుడైన ఎస్.చిన్నరెడ్డప్పతో కలిసి దాడికి పాల్పడినట్టు బాధితుడు శివారెడ్డి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించిన న్యాయస్థానం రెడ్డిశేఖర్‌కు 9 నెలల జైలు, రూ.2,500 జరిమానా, ఎస్.చిన్నరెడ్డెప్పకు 8 నెలల జైలు, రూ.1,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్టు ప్రశాంత్ తెలిపారు.



సీఎం మేలును మరువలేం



నేను ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నా. భార్య గౌతమి గృహిణి. నాకు రుషికుమార్, సాయికుమార్, యశ్వంత్, చరిత, హరిశంకర్ బిడ్డలున్నారు. ఐదు మంది పిల్లల్లో చినబాబు ఇంటి వద్దే ఉంటాడు. మిగిలిన నలుగురు స్థానిక నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. పిల్లలను చదివించాలంటే భయం వేసేది. అమ్మ ఒడి పథకం కింద నా కూతురు చరితకు రూ.15 వేలు డబ్బు వస్తోంది. దీంతో పిల్లల చదువుకయ్యే ఖర్చు బరువు తగ్గింది. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయి. కార్పొరేట్ పాఠశాలగా దీటుగా ప్రభుత్వ పాఠశాల ఉంది. ఆయన మేలు ఎన్నటికి మరువలేను.
– ఆర్ముగం రెడ్డిశంకర్, మదనపల్లె.

జగనన్న సురక్షతో ఉచితంగా సర్టిఫికెట్‌లు



వైఎస్ఆర్ చేయూత పథకానికి ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల కోసం తహసీల్దారు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవాళ్లం, కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వలంటీర్ మా ఇంటికి వచ్చి ఆధార్, రేషన్ కార్డులు తీసుకెళ్లి ఉచితంగా ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలను తయారు చేయించి అధికారుల ద్వారా తనకు సర్టిఫికెట్లను ఇప్పించారు. సర్టిఫికెట్ల కోసం ఆఫీసుల చుట్టూ తిరగకుండా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం. – నల్లగొండు వెంకటరమణమ్మ, శివాలయం వీధి, భాకరాపేట, సిద్ధవటం.

అంగన్‌వాడీ కార్యకర్తలు మరియు సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి!

1. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 11 డిమాండ్లతో 12.12.2023 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరియు ముఖ్య కార్యదర్శి మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఆర్థిక శాఖ వివిధ స్థాయిలలో ప్రభుత్వం అనేక దఫాలుగా చర్చలు చేసిన తరువాత, ప్రభుత్వం కొన్ని డిమాండ్లను అంగీకరించింది, తదనుగుణంగా ప్రభుత్వం GO లను జారీ చేసింది మరియు అందరికీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయలు, పప్పు దినుసులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు మరియు నిర్వహణ ఛార్జీలు విడుదల చేయడం జరిగింది.
   a) అంగన్‌వాడీ హెల్పర్‌ను అంగన్‌వాడీ వర్కర్‌గా పదోన్నతి కల్పించేందుకు వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ 20.12.2023 తేదీన జి.ఓ.ఎం.ఎస్.నెం.44 జారీ చేయబడింది.
   b) అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు ఒకసారి TA/DA మరియు అంగన్‌వాడీ హెల్పర్‌లకు త్రైమాసిక TA/DA క్లెయిమ్ చేయడానికి మెమో నం.2303564/2023/PROG-I-A1,dt.20.12.2023 జారీ చేయబడింది. ఈ ఆదేశాలు జారీ చేసిన తేదీ నుంచి అమలులోకి వస్తాయి.
   c) అంగన్‌వాడీ వర్కర్లు & హెల్పర్‌ల కొనసాగింపుకు గరిష్ట వయోపరిమితిని 62 సంవత్సరాలుగా నిర్ణయించి, సేవా ముగింపు ప్రయోజనం రూ.1,00,000/- మరియు రూ.40,000 అందించడానికి జి.ఓ.ఎం.ఎస్.నెం.47, తేది 20.12.2023 జారీ చేయబడింది.
   d) అద్దెలు (Rs. 66.54 Crs) పరిపాలనా ఖర్చులు (నీరు & విద్యుత్ ఛార్జీలు, చీపుర్లు, ఫినాయిల్ మొదలైనవి) (Rs. 7.81 Crs) మరియు AWCల నిర్వహణ (చిన్న మరమ్మతులు) రూ.6.36 Crs) కోసం బడ్జెట్‌లు విడుదల చేయబడ్డాయి.
2. అంతేకాకుండా 2019 నుండి,
   a) అంగన్‌వాడీ వర్కర్ల జీతాలను రూ.11,500/-లకు, మినీ అంగన్వాడీ జీతాలను రూ.7,000/-కు, అంగన్‌వాడీ హెల్పర్ల జీతాలను రూ.7,000/-కు పెంచింది.
   b) 2013 నుంచి అంగన్‌వాడీల కార్యకర్తలకు, సూపర్‌వైజర్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయడం జరిగింది.
   c) ఇదే సందర్భంలో ఈ సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్షలు రాసేవారి వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ వారికి అనుకూల నిర్ణయం తీసుకుంది. దీంతో 9 ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఎక్కువ మంది పోటీపడే అవకాశాన్ని కల్పించడం జరిగింది.
   d) అన్నింటికంటే ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలకు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి వారికి డీబీటీ ద్వారా రూ.1,313 కోట్లు అందించడం జరిగింది. నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ తదితర పథకాలను వారికి వర్తింప చేస్తోంది.
   e) ఈ ఏడాది నుంచి అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు జీవిత బీమాను కూడా వర్తింపు చేస్తోంది. ప్రమాద బీమాగా రూ.2 లక్షల వరకూ చెల్లించడం జరుగుతోంది.
   f) గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు గతంలో మాదిరిగా వండి ఇచ్చే ఇబ్బంది లేకుండా టేక్ హోమ్ రేషన్ పద్ధతిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీనివల్ల వారికి పనిభారం తగ్గడమే కాకుండా పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించే మార్గాలను అంగన్‌వాడీలకు అందిస్తూ 2023 నుంచి ప్రభుత్వం డ్రై రేషన్ అందిస్తోంది.
3. జాతీయ ఆహార భద్రతా చట్టం (NFSA), 2013 నిర్దేశించిన విధంగా ప్రతి గర్భిణీ స్త్రీలకు మరియు పాలిచ్చే తల్లికి బిడ్డ పుట్టిన 6 నెలల వరకు మరియు 7 నెలల నుండి 6 సంవత్సరాల వయస్సు గల ప్రతి బిడ్డకు (పౌష్టికాహార లోపంతో బాధపడే వారితో సహా) సప్లిమెంటరీ న్యూట్రిషన్ అందించడం తప్పనిసరి. వారి సంబంధిత అంగన్‌వాడీ సెంటర్లో నమోదు చేసుకున్న లబ్ధిదారులకు అనుబంధ పోషకాహారం అన్ని పనివేళల్లో అందించాలి. ICDS పథకం కింద సప్లిమెంటరీ న్యూట్రిషన్, క్యాలెండర్ సంవత్సరంలో కనీసం 300 లేదా నెలలో సగటున 25 రోజులు అనగా, ఉదయం స్నాక్స్, వేడిగా వండిన భోజనం (HCM) మరియు టేక్ హోమ్ రేషన్‌గా అందించాలి.
4. సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం యొక్క లక్ష్యాలు గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు, 7 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లలకు మరియు 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల పిల్లలకు నిరంతరం పోషకాహార సహాయాన్ని అందజేయడం. AWWలు & AWHలు సమ్మె వలన వారి విధులకు హాజరు కాకపోవడం వలన, పోషకాహార కిట్‌లు, THR మరియు గుడ్లు & పాలు మరియు పంపిణీ చేయబడిన సప్లిమెంటరీ న్యూట్రిషన్ (SNP) లబ్ధిదారులకు లేదు. అంతేకాకుండా, గర్భిణీలు & పాలిచ్చే తల్లులు & 06 నెలలు-6 సంవత్సరాల పిల్లలను ఆరోగ్య శాఖ ANM సమన్వయంతో అంగన్‌వాడీ కేంద్రంలో వివిధ పెరుగుదల/ఆరోగ్య పారామితులపై పర్యవేక్షణ జరగటం లేదు.
5. పైన పేర్కొన్న అంశాల దృష్ట్యా, అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే సేవలకు ఆటంకం ఏర్పడినందున, గర్భిణులు & పాలిచ్చే స్త్రీలు, చిన్న పిల్లలు మరియు అణగారిన వర్గాల యొక్క ప్రయోజనాల దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే సేవలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరియు ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయడం జరిగింది.
6. పిల్లలకు మరియు గర్భవతులు మరియు బాలింతలకు ఎలాంటి అంతరాయం లేకుండా పోషకాహారాన్ని అందించటానికి, అంగన్‌వాడీ సెంటర్లను నిర్వహించటానికి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడానికి జివిడబ్ల్యువి & విఎస్‌డబ్ల్యుఎస్ (లేదా) సెర్ప్ (లేదా) రెండింటి కలయికతో కూడిన గ్రామ సంస్థల యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటున్నాము.
7. క్యాబినెట్ మంత్రుల గ్రూపు, చీఫ్ సెక్రటరీ, ముఖ్య కార్యదర్శి స్థాయి అధికారులు మీతో పలు దఫాలుగా చర్చించి, సమ్మెను విరమించుకోవలసినదిగా విజ్ఞప్తి చేసియున్నారు. డిపార్టుమెంట్ కూడా అందరు అంగన్‌వాడీ కార్యకర్తలు బల్క్ ఎస్.ఎం.ఎస్ ను పంపించి సమ్మెను విరమించుకోవలసినదిగా కోరటం జరిగింది. ప్రస్తుతం 53.7% గర్భవతులు రక్తహీనతతో వున్నారు, 29.6% 5 సంవత్సరాల లోపు పిల్లలు బరువు తక్కువగా వున్నారు, 16.1% 5 సంవత్సరాలలోపు పిల్లలు ఎత్తుకు తగిన బరువు లేకుండా (ఎన్.ఎఫ్.హెచ్.ఎస్-5 ప్రకారంగా) వున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీలో జరుగుతున్న అంతరాయం వలన వీరి ఆరోగ్య మరియు పోషణ స్థాయిలు దిగజారి హైరిస్క్ గ్రూప్‌లో పడే ప్రమాదం వున్నది. మీరు సమ్మె నోటీసు ఇచ్చి ఉన్నారు. దీన్ని పరిష్కరించుకొని ప్రభుత్వం వారు మీ సంఘము యొక్క సభ్యులతో పలుసార్లు చర్చించి ముఖ్యమైన కోరికలకు ప్రాథమికముగా ఆమోదం తెలిపియున్నారు. ప్రభుత్వం మిగిలిన కోరికలను పరిష్కరించుటకు ప్రయత్నములు చేయుచున్నప్పటికీ, మీరు మీ యొక్క ఉద్యోగ బాధ్యతలను విస్మరించి విధులకు రావటం లేదు. కావున జిల్లా పరిపాలన అధికారిగా మీకు విజ్ఞప్తి చేయడం ఏమనగా మీ న్యాయమైన కోర్కెలన్నీ ప్రభుత్వం పరిష్కరించడానికి కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే ప్రభుత్వం చాలా డిమాండ్లను పరిష్కరించిందని గుర్తించుకోవలసినదిగా అభ్యర్థిస్తున్నాము. అలాగే ఈ సమ్మె వల్ల బాలింతలు, గర్భిణీ స్త్రీలు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సహృదయంతో అర్థం చేసుకోవాలని మనవి చేస్తున్నాము. గర్భవతులు మరియు పిల్లల ఆరోగ్య మరియు పోషణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నాము మరియు జనవరి 5, 2024 లోగా విధులకు హాజరు కావలసినదిగా కోరుచున్నాము. ఒకవేళ సమ్మె విరమింప చేయని యెడల ప్రభుత్వ నియమ నిబంధనల అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియచేయటమైనది.

ఇట్లు
జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్, అన్నమయ్య జిల్లా.

ఆడపిల్లను కాపాడుకుందాం

డీఎంఅండ్‌హెచ్ఓ కొండయ్య


మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్ఓ కొండయ్య


కలెక్టర్ నుంచి ఉత్తమ ఆరోగ్యమిత్ర పురస్కారాన్ని అందుకుంటున్న మల్లికార్జున

రాయచోటి అర్బన్ : ఆడశిశువును కాపాడడం ద్వారా సృష్టిని రక్షిద్దామని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య అన్నారు. గురువారం పట్టణంలోని సాయి ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాలోని ప్రభుత్వ వైద్యులు, స్కాన్‌సెంటర్ల వైద్యులు, వివిధ శాఖల అనుబంధ జిల్లా అధికారులకు నిర్వహించిన ఒకరోజు లింగస్థ పిండ నిర్ధారణ చట్టంపై శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. గర్భిణులకు ఏవైనా గర్భస్థ పిండ సమస్యలు తెలుసుకునేందుకు మాత్రమే అల్ట్రాసౌండ్ స్కానింగ్‌ను ఉపయోగించుకోవాలన్నారు. లింగనిర్ధారణకు, భ్రూణహత్యలకు వినియోగించరాదన్నారు. పీసీపీఎస్ డీటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాలను నిర్వహించే వారంతా తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. చట్ట విరుద్ధంగా కేంద్రాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పీసీపీ ఎస్‌డీటీ జిల్లా నోడల్ అధికారిణి ఉషశ్రీ మాట్లాడుతూ స్కాన్‌సెంటర్ నిర్వాహకులు సమయానుగుణంగా రెన్యువల్ చేసుకోవాలని, స్కానింగ్ చేయించుకున్న లబ్ధిదారుల వివరాలు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. సీపీఎస్‌డీటీ జిల్లా ప్రోగ్రాం అధికారిణి దేవ శిరోమణి మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ చేస్తే రూ.10వేలు జరిమానా, మూడేళ్లు జైలుశిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి స్త్రీవైద్యనిపుణురాలు కోటేశ్వరి, సోషియల్ వెల్ఫేర్ డీడీ జాకీర్‌హుస్సేన్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జయరాం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బి.వి.రత్నం, లలిత, చెన్నారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్‌లు బలరామరాజు, మహమ్మద్‌రఫీ, సీహెచ్ఓ రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఆరోగ్యమిత్రగా మల్లికార్జున

మదనపల్లె మున్సిపాలిటీలో ఆరోగ్యమిత్రగా పనిచేస్తున్న మల్లిఖార్జునను ఆగస్టు మాసానికి జిల్లా ఉత్తమ ఆరోగ్యమిత్రగా అధికారులు ఎంపిక చేశారు. గురువారం జకలెక్టర్ చేతులమీదుగా మల్లిఖార్జునకు ఉత్తమసేవా ఆరోగ్యమిత్ర ప్రశంసా పత్రం, రూ.5వేల నగదును చెక్కురూపంలో అందచేశారు.

ఈఆర్ఓ రామమోహన్ సస్పెన్షన్


రామమోహన్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎం. రామమోహన్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జీఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న రామమోహన్ ప్రొద్దుటూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కొంతకాలంగా పనిచేస్తున్నారు. టీడీపీ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్ కుమార్‌రెడ్డి పలు పోలింగ్ కేంద్రాల్లో మృతుల ఓట్లు తొలగించలేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఈఆర్ఓను సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకుంది.

మఠం.. ఉత్సవ శోభితం


విద్యుద్దీప అలంకరణలో శ్రీ ఈశ్వరీదేవి మఠం


అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

- వైభవంగా శ్రీ ఈశ్వరీదేవి ఆరాధనోత్సవాలు
- ఘనంగా ఏర్పాట్లు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని శ్రీఈశ్వరీదేవి మఠం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అమ్మవారి ఆరాధన గురుపూజోత్సవాల సందర్భంగా నూతన శోభ సంతరించుకుంది. ఆరాధనోత్సవాల్లో రెండో రోజైన గురువారం ఈశ్వరీదేవికి విశేష పూజలు చేశారు. ఉదయం ప్రభాత సేవతో కార్యక్రమాలు మొదలుపెట్టారు. బ్రహ్మంగారిమఠం మండలం చౌదరివారిపల్లెకు చెందిన శ్రీ సీతారామ భజన మండలి ఆధ్వర్యంలో చేపట్టిన భజన భక్తులను అలరించింది. బ్రహ్మంగారి మఠం మండలం గంగిరెడ్డిపల్లెకు చెందిన శ్రీ అచలానందస్వామి కోలాట బృందం చేసిన కోలాటం ఆకట్టుకుంది. అమ్మవారు అశ్వవాహనంపై ఆశీనులై భక్తులను ఆశీర్వదించారు. సాయంత్రం సూక్తపారాయణం, అభిషేకం చేశారు. రాత్రి హంస వాహనోత్సవం కనుల పండువగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వారికి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి ఆశీస్సులతో ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో దేవదాయ శాఖ, మఠం సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఈశ్వరీమాత సేవా సమితి ట్రస్టు చైర్మన్ కమ్మరి పార్వతమ్మ, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రధాన వేడుక

శ్రీఈశ్వరీదేవి 1789లో మార్గశిర బహుళ నవమినాడు సజీవ సమాధి నిష్ఠ వహించారు. అప్పటి నుంచి ఏటా అమ్మవారి ఆరాధన గురుపూజోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది బహుళ నవమి (శుక్రవారం) ప్రధాన వేడుక నిర్వహిస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు భారీగా తరలి వస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మహిళా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర సమర్పిస్తారు. అనంతరం సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఇందులో మఠాధిపతి దంపతులు పాల్గొంటారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వల్లూరు : మండల పరిధిలోని తోళ్లగంగనపల్లె సమీపంలో అంబవరం వెళ్లే దారికి పక్కన గల ముళ్లపొదల్లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. గురువారం సాయంత్రం తోళ్లగంగనపల్లె సమీపంలోని ముల్ల పొదల నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. గుర్తు తెలియని పురుషుని మృతదేహం కుళ్లి దుర్వాసన వస్తుండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు 5 నుంచి 6 రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మృతుడు సుమారు 70 నుంచి 80 సంవత్సరాల మధ్య వయసు ఉండవచ్చని భావిస్తున్నారు. కమలాపురం సీఐ రామకృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. శుక్రవారం సంఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.